సాక్షి
కుమురం భీం
శుక్రవారం 29 డిసెంబర్ 2023

ఐఎన్టీయూసీ కొంపముంచిన చేరికలు



అడ్డగోలు చేరికలు ఐఎన్టీయూసీ కొంపముంచాయి. టీబీజీకేఎస్ నేతలను చేర్చుకోవడం ఎన్నికల్లో ఓటమికి కారణమైందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. 10లో▸



'ప్రజా పాలన' ఫ్లెక్సీలో తప్పులు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని ఓ వార్డు సభలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో తప్పు దొర్లింది. 'ప్రజా పాలన' దరఖాస్తుల గడువు 2024 డిసెంబర్ 06 వరకు ఉందని ముద్రించారు.

గరిష్టం/కనిష్టం
27.8/14.4

వాతావరణం

ఆకాశం చాలావరకు మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా తగ్గుతాయి. రాత్రి మంచు ఎక్కువగా కురుస్తుంది. వేకువజామున పొగమంచు ఎక్కువగా ఉంటుంది.

అర్హత లేకున్నా అందలం!

- క్యాంప్ క్లర్క్(సీసీ) పోస్టుల్లో అనామకులు
- చక్రం తిప్పిన కలెక్టరేట్ అధికారి
- పతాక స్థాయికి ఓ 'సీసీ' అవినీతి
- జిల్లా సర్వోన్నతాధికారి పేరిట వసూళ్ల పర్వం
- తల పట్టుకుంటున్న జిల్లా స్థాయి ఉన్నతాధికారులు
- అక్రమార్కులకు కీలక కొలువులు దక్కడంపై సర్వత్రా విమర్శలు


జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్

సాక్షి, ఆసిఫాబాద్: జిల్లా కలెక్టర్ సీసీ(క్యాంప్ క్లర్క్) పోస్టు జిల్లా పరిపాలన విభాగంలో ఎంతో కీలకమైంది. అదనపు కలెక్టర్ల వద్ద పనిచేసే సీసీలదీ ప్రధాన పాత్రే. కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్లకు వెళ్లే ఫైళ్లన్నీ వీరి ద్వారానే వెళ్తాయి. జిల్లాస్థాయి ఉన్నతాధికారుల కార్యకలాపాలు, సమీక్షలకు హాజరు కావడం, సలహాలు ఇవ్వడం వీరి అధికారిక విధుల్లో భాగం. కలెక్టరేట్‌లో ఇంతటి ప్రాధాన్యత కలిగిన కీలక కొలువులను కొందరు అనామకులు దక్కించుకోవడం.. ఓ కీలక అధికారి ఎలాంటి ఉత్తర్వులు(ఆర్డర్ కాపీలు) లేకపోయినా తన అనుచరులకే సీసీ పోస్టులు దక్కేలా చక్రం తిప్పడం జిల్లాలో చర్చనీయాంశమైంది. కీలక పోస్టుల్లో ఆసీనులైన ఆ ముగ్గురూ స్వామి భక్తిని ప్రదర్శిస్తూ.. జిల్లా స్థాయిలో అవినీతి అక్రమాలకు తెరతీశారని ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి వారిపై జిల్లా సర్వోన్నతాధికారి అప్రమత్తంగా లేకపోతే పాలన గాడితప్పుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఆయనే 'రాజు'..

2012 సమయంలో ఆసిఫాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా ఓ వ్యక్తిని అప్పటి తహసీల్దార్ నియమించుకున్నారు. అప్పుడు అతడి వేతనం రూ.5 వేలు. అది కూడా రేషన్ డీలర్లు సమకూర్చేవారని సమాచారం. 2016లో చంపాలాల్ కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న సమయంలో ఉత్సాహవంతుడైన యువకుడి కోసం అన్వేషిస్తున్న నేపథ్యంలో ఆసిఫాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న అతడిని సీసీగా నియమించారు. ఆ తర్వాత కొన్నాళ్లకు కలెక్టర్ సిఫార్సుతో అతను హ్యాండ్ హోల్డింగ్ పర్సన్(హెచ్‌హెచ్‌పీ)గా నియమించబడ్డాడు. అది కూడా ఎలాంటి అధికారిక ఉత్తర్వులు లేకుండానే.. ఈ హెచ్‌హెచ్‌పీ పోస్టులు కలెక్టరేట్‌లో ఒకటి, రెవెన్యూ డివిజన్ కార్యాలయాల్లో రెండు ఉన్నాయి. కంప్యూటర్ హార్డ్‌వేర్ నిర్వహణ పనులు చూడటం.. కంప్యూటర్లలో తలెత్తే సమస్యలు పరిష్కరించటం.. ప్రభుత్వం ప్రకటించే కొత్త పథకాలకు సంబంధించి రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్న మండలాల్లోని సిబ్బందికి శిక్షణ ఇవ్వడం వీరి విధి. అయితే కొన్నాళ్లకు కలెక్టర్ చంపాలాల్ తన వద్ద పనిచేసే సీసీపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తడంతో అతడిని విధుల నుంచి తప్పించారు. ఆ తర్వాత గతేడాది జిల్లాకు కొత్త కలెక్టర్ రావడంతో గత కలెక్టర్ వద్ద సీసీలుగా పనిచేస్తున్న ఇద్దరు తహసీల్దార్ స్థాయి అధికారులను ఉన్నఫలంగా తొలగించి మళ్లీ చంపాలాల్ వద్ద పనిచేసిన వ్యక్తినే సీసీగా నియమించడం చకచకా జరిగిపోయాయి. ప్రస్తుతం అతనే 'రాజు'గా జిల్లా అధికారులను శాసిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. కొత్తగా బాధ్యతలు చేపట్టిన జిల్లా సర్వోన్నతాధికారికి పలు శాఖలపై పట్టులేకపోవడంతో సీసీ చెప్పిందే వేదంగా మారిందన్న విమర్శలు ఉన్నాయి. డీఆర్‌డీఏలో ఏపీడీ స్థాయిలో పనిచేసే ఓ అధికారి బయోమెట్రిక్ డివైజ్ కొనుగోళ్ల వ్యవహారం.. థియేటర్‌లో పనిచేసే ఓ మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించాడని అవినీతి ఆరోపణలు వచ్చాయి. అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) విచారణ జరిపి కలెక్టర్‌కు నివేదిక సమర్పించగా.. అతనిపై చర్యలకు ఉపక్రమించిన సమయంలో సదరు సీసీ జోక్యంతో ఆ అధికారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. అందుకు రూ.2 లక్షలు పైగా చేతులు మారినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎన్నికల సమయంలో జనావాసాలకు 20 కిలోమీటర్ల దూరంలో పోలింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారన్న కారణంతో ఓ తహసీల్దార్‌పై ఎన్నికల సంఘం వేటు పడింది. అతని స్థానంలో మరొకరికి పోస్టింగ్ ఇప్పించడంలోనూ సీసీ హస్తం ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే జిల్లాలో మండల రెవెన్యూ అధికారులకు నెలనెలా రూ.50 వేలు ముట్టజెప్పాలని ఆదేశించినట్లు సమాచారం. ధరణి ఫైళ్లను పరిష్కరించడం ద్వారా ఆ మొత్తాన్ని ఇవ్వాలని కూడా అతడే సలహాలు ఇస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాస్థాయి అధికారులకూ టార్గెట్లు పెట్టినట్లు ప్రచారం ఉంది. కాంట్రాక్టర్లు చేపట్టే పనుల్లో 5 శాతం కమీషన్ రూపంలో అప్పగించాలని ఆదేశించినట్లు సమాచారం. సర్వోన్నతాధికారి నిర్వహించే సమీక్షలు సైతం అతనే నిర్వహిస్తుండడంతో జిల్లా స్థాయి ఉన్నతాధికారులు తలలు పట్టుకుంటున్నారు. అతనికి ఎదురుచెప్పే ధైర్యం చేయలేక మదనపడుతున్నట్లు సమాచారం.

అదనపు కలెక్టర్ల వద్దా.. అనర్హులే

పదేళ్ల క్రితం ఆసిఫాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వర్తించిన ఆ వ్యక్తి డిగ్రీ కూడా పూర్తి చేయలేదని తెలుస్తోంది. మొదట తహసీల్దార్ ఆఫీసుల్లో పనిచేసి.. జిల్లా ఏర్పడిన తర్వాత కలెక్టరేట్‌లో కార్యకలాపాలు చక్కదిద్దే ఓ అధికారి వద్ద సీసీగా చేరాడు. ప్రస్తుతం అతను ఓ ఐఏఎస్ అధికారి వద్ద సీసీగా పని చేస్తుండటం విశేషం. మరో సీసీ నేపథ్యాన్ని పరిశీలిస్తే.. ఆయన ఏం చదివారో ఎవరికీ తెలియదు. కానీ మరో అదనపు కలెక్టర్‌కు సీసీగా పనిచేస్తున్నాడు. వీరిద్దరికి కూడా ఎలాంటి నియామక ఉత్తర్వులు లేకపోయినా.. ఉన్నత కొలువులు దక్కించుకోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కీలక కొలువుల్లో అనుచరులు..

జిల్లాస్థాయిలో కీలకమైన సీసీ పోస్టుల్లో అనామకులను నియమించడం వెనుక కలెక్టరేట్‌లో పాతుకుపోయిన ఓ అధికారి కీలక పాత్ర పోషించినట్లు తెలుస్తోంది. ఆ అధికారికి ఇటీవల పదోన్నతి లభించినా.. అతను స్థానభ్రంశం చెందకుండా ప్రస్తుతం ఉన్న స్థానంలోనే కొనసాగడంపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. పదేళ్లకుపైగా ఒకే స్థానంలో పనిచేస్తుండటం.. జిల్లా స్థాయిలో పనిచేసే అధికారుల పనితీరుపై అవగాహన ఉండటం.. జిల్లా ఉన్నతాధికారులకు నమ్మినబంటుగా ఉండటంతో అతడిపై బదిలీ వేటు పడలేదని ఉద్యోగవర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అందువల్లే కీలకమైన ముగ్గురు జిల్లా ఉన్నతాధికారుల వద్ద తన అనుచరులనే సీసీలుగా నియమించుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. జిల్లా రెవెన్యూ అధికారి వద్ద సైతం అతని మనిషే సీసీగా ఉండటం గమనార్హం. పైగా వీరు ఉన్నతాధికారులు తీసుకునే కీలక నిర్ణయాలు, సమాచారం మొత్తం ఆ అధికారికి చేరవేస్తారన్న ఆరోపణలున్నాయి. ఆర్థిక పరమైన ఫైళ్లను చకచకా పూర్తి చేయడమే కాకుండా.. బిల్లులు సైతం ఆ కీలక అధికారి కనుసన్నల్లోనే జరిగిపోతాయని ఆరోపణలు సైతం లేకపోలేదు. ట్రెజరీలో పనిచేసే ఓ ఉద్యోగి కీలకమైన క్రెడెన్షియల్ వివరాలను ఆ అధికారికి తెలియచెప్పినట్లు సమాచారం. ఆ వివరాలతో అతను తన కంప్యూటర్‌లోనే బిల్లులకు నిధులు విడుదల చేసుకోవడం జరుగుతోందని తెలుస్తోంది. ఇందుకు ప్రతిఫలంగా సదరు ట్రెజరీ ఉద్యోగికి ఆసిఫాబాద్‌లోని ఎన్‌జీవో కాలనీలో రూ.50 లక్షలు విలువచేసే ప్లాట్‌ను ఇప్పించినట్లు సమాచారం. వాస్తవానికి రెవెన్యేతర ఉద్యోగికి ఎన్‌జీవో కాలనీలో ప్లాట్లు ఇవ్వొద్దు. కానీ అ అధికారికి తన పలుకుబడితో ట్రెజరీ ఉద్యోగికి లాభం చేకూర్చినట్లు ఆరోపణలు ఉన్నాయి.

నేరాల అదుపు.. కేసుల పరిష్కారం

- ఏడాదిలో పలు కేసుల్లో వేగంగా శిక్షలు పడేలా చర్యలు
- జిల్లాలో పెరిగిన హత్య కేసులు
- చోరీ కేసుల్లో రికవరీ 6.7 శాతమే..
- పోలీసు వార్షిక నివేదిక వెల్లడించిన ఎస్పీ సురేశ్‌కుమార్

సాక్షి, ఆసిఫాబాద్: ఈ ఏడాది కాలంలో శాంతి భద్రతల పరిరక్షణతోపాటు గతంలో జరిగిన నేరాల్లో నిందితులకు శిక్షలు పడేలా జిల్లా పోలీసులు విశేష కృషి చేశారు. రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లోనూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుండా పని చేశారు. సుమారు ఆరు నెలల పాటు నిర్విరామంగా పనిచేయడంతో ఎన్నికల క్రతువు ప్రశాంతంగా ముగిసింది. జిల్లా పోలీసు శాఖ 2023 వార్షిక నివేదికను ఎస్పీ కె.సురేశ్‌కుమార్ గురువారం వెల్లడించారు.

మొత్తం 758 కేసులు..

జిల్లా పరిధిలోని ఆసిఫాబాద్, ఆసిఫాబాద్ ట్రాఫిక్, కాగజ్‌నగర్, కాగజ్‌నగర్ రూరల్, రెబ్బెన, వాంకిడి, కెరమెరి, జైనూర్, లింగాపూర్, తిర్యాణి, చింతలమానెపల్లి, దహెగాం, బెజ్జూర్, కౌటాల, సిర్పూర్(యూ), సిర్పూర్(టి), ఈజ్‌గాం, పెంచికల్‌పేట్, మహిళా పోలీసు స్టేషన్ల పరిధిలో ఈ ఏడాది 758 కేసులు నమోదయ్యాయి. హత్యలు 19, అత్యాచారాలు 22, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ 23, కిడ్నాప్‌లు 21, ఆస్తి సంబంధిత నేరాలు 95, నేరపూరిత నరహత్యలు 4, దొమ్మి కేసులు 4, గాయాల కేసులు 156, రోడ్డు ప్రమాదాలు 120, చీటింగ్ కేసులు 88, పోక్సో కేసులు 17, గంజాయి కేసులు 9, సైబర్ నేరాలు 26, మహిళలపై అఘాయిత్యాల కేసులు 154 ఉన్నాయి. చోరీ కేసుల్లో కాజేసిన ఆస్తి విలువ రూ.1.14 కోట్లు కాగా.. దాదాపు 6.7 శాతం అంటే రూ.17 లక్షల ఆస్తిని రికవరీ చేశారు. ఇక టాస్క్‌ఫోర్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం మొత్తం 752 కేసులు నమోదు చేయగా.. అందులో రేషన్ బియ్యం తరలింపునకు సంబంధించిన 31 కేసులు, గ్యాంబ్లింగ్ 58 కేసులు, మట్కా 15 కేసులు, ఎక్సైజ్ కేసులు 468, నకిలీ విత్తనాల పంపిణీ 7 కేసులు, నకిలీ పురుగుల మందుల పంపిణీ 8 కేసులు నమోదు చేశారు.

యావజ్జీవ శిక్షలు..

2023లో మొత్తం 868 కేసుల్లో తుది తీర్పు వెలువడగా.. అందులో 286 కేసుల్లో నేరనిరూపణ జరిగింది. వీటిలో 6 హత్య కేసుల్లో 12 మంది నేరగాళ్లకు జీవితఖైదు మరో 5 రేప్ కేసుల్లో ఇద్దరికి యావజ్జీవ శిక్ష పడింది. మరో కేసుల్లో ఒక నేరస్తుడికి 20 ఏళ్ల జైలు శిక్ష, ఇద్దరికి 10 ఏళ్లు, రెండు నేరపూరిత నరహత్యలు కేసుల్లో ఒక నేరస్తుడికి ఏడేళ్లు, మరొకరికి ఐదేళ్లు, 15 వివిధ కేసుల్లో నేరస్తులకు మూడేళ్లలోపు జైలు శిక్ష విధించారు. ఇవి కాకుండా 251 కేసుల్లో రాజీ కుదిర్చారు. మొత్తంగా ఈ ఏడాది నేర నిరూపణ 32.94 శాతంగా నమోదైంది.

శాంతి భద్రతలు

శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఈ ఏడాది 1,011 మంది పాత నేరస్తులను బైండోవర్ చేశారు. పోలీసు గ్రామ సందర్శన, అవగాహన కార్యక్రమాలు చేపట్టడం, పోలీసు పెట్రోలింగ్ పెంచడం ద్వారా కమ్యూనిటీ గ్రూపుల మధ్య గొడవలు, ఇతర అల్లర్లు జరగకుండా చర్యలు తీసుకున్నారు. నిషేధిత మావోయిస్టు పార్టీ ఉనికిని చాటుకోవడానికి జిల్లాలోకి ప్రవేశించి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తారనే సమాచారంతో స్పెషల్ పార్టీ బలగాలతో కూంబింగ్ ఆపరేషన్స్ నిర్వహించారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండ చర్యలు తీసుకున్నారు. ఈ ఏడాది మార్చి 28న పెంచికల్‌పేట్ మండలంలో మావోయిస్టు పార్టీలో చేరడానికి వెళ్తున్న జిల్లెడ గ్రామానికి చెందిన కోట ఆనంద్‌రావు, నల్లగొండ జిల్లా మునుగోడు మండలం కొరితీకల గ్రామానికి చెందిన చెన్నగొణి గణేశ్‌ను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 25 డిటోనేటర్లు, 10 జిలెటిన్ స్టిక్స్, మోటార్ సైకిల్, రెండు ఫోన్లు, నిషేధిత మావోయిస్టు పార్టీ కరపత్రాలు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ముఖ్య జాతరలైన గంగాపూర్, శివరాత్రి, జోడేఘాట్, టోంకిని హనుమాన్ భక్తుల పాదయాత్ర, తదితర వాటికి భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

కమ్యూనిటీ పోలీసింగ్..

జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 3718 కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలు నిర్వహించారు. అందులో ప్రధానంగా తిర్యాణి మండలంలోని రొంపెల్లి నుంచి గుండాల వరకు సుమారు ఏడు కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం పోలీసులే చేపట్టారు. 106 మంది వికలాంగుల్లో 94 మందికి కృత్రిమ కాళ్లు, 12 మందికి కృత్రిమ చేతులు తయారు చేయించి అందజేశారు. యువతకు 600 స్పోర్ట్స్ కిట్లు, మారుమూల ప్రాంతాల్లోని పేద కుటుంబాలకు సామగ్రి, సుమారు 3000 దుప్పట్లు పంపిణీ చేశారు. గిరిజన యువతకు డ్రైవింగ్ లైసెన్సులు జారీ చేయించారు.

గతేడాదితో పోల్చితే..

గతేడాదితో పోల్చితే హత్య కేసులు 35.71 శాతం పెరిగాయి. ఆస్తి సంబంధిత నేరాలు 27.48 శాతం తగ్గాయి. అలాగే నేరపూరిత నరహత్యలు 20 శాతం తగ్గగా.. దొమ్మి కేసులు 20 శాతం, కిడ్నాప్ కేసులు 50 శాతం, రేప్ కేసులు 21.43 శాతం, గాయాల కేసులు 8.24 శాతం, మోసపూరిత నేరాలు 71.05, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నేరాలు 36.11 శాతం, పోక్సో చట్టం కేసులు 5.56 శాతం, గంజాయి కేసులు 59.09 శాతం, సైబర్ నేరాలు 23.53 శాతం, మహిళలపై అఘాయిత్యాలు 6.10 శాతం తగ్గాయి.

వచ్చే ఏడాది ఇదే స్ఫూర్తితో..

జిల్లా పరిధిలో నమోదైన కేసుల్లో 90 శాతం పరిష్కారమయ్యేలా చూశాం. పోలీసు అధికారులు, కోర్టు డ్యూటీ అధికారులు సమన్వయంతో పని చేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాం. వచ్చే సంవత్సరంలో కూడా ఇదే స్ఫూర్తితో పని చేస్తాం.

– కె.సురేశ్‌కుమార్, ఎస్పీ

న్యూస్‌రీల్

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి


పరిచయం చేసుకుంటున్న డీఎస్‌వో

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని డీఎస్‌వో మీనారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడాపాఠశాలలో గురువారం రాష్ట్రస్థాయి క్రీడాకారులకు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. డీఎస్‌వో మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన జోనల్‌స్థాయి పోటీల్లో రాణించి రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులకు వారం రోజుల పాటు శిక్షణ అందిస్తామని తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి అథ్లెటిక్స్, ఖోఖో, కబడ్డీ, క్యారమ్, చెస్, టెన్నీకాయిట్ పోటీలకు సంబంధించి బాలురు 120, బాలికలు 120 మందికి శిక్షణ ఉంటుందన్నారు. వీరు జనవరి 4న భద్రాచలంలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఏటీడీవో క్షేత్రయ్య, వ్యాయమ ఉపాధ్యాయుడు మధుసూదన్, కోచ్‌లు అరవింద్, విద్యా సాగర్, 28 మంది పీఈటీలు, పీడీలు పాల్గొన్నారు.

తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడిగా విజయ్‌కుమార్

ఆసిఫాబాద్: ఆదివాసీ హక్కుల పోరాట సమితి(తుడుందెబ్బ) జిల్లా అధ్యక్షుడిగా కోవ విజయ్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడిగా గేడం గోపిచంద్, ప్రధాన కార్యదర్శిగా పెందూర్ మారుతి, ఉపాధ్యక్షులుగా చహకటి గణేశ్, మడావి గుణవంత్‌రావు, శేషు, ఏర్గటి సుధాకర్, సహాయ కార్యదర్శులుగా గేడం నగేశ్, గంట గోపాల్, ప్రచార కార్యదర్శిగా కొడిపె వెంకటేశ్, జిల్లా సలహాదారులుగా సిడాం శంకర్‌ను ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్‌లో గురువారం సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మైపతి అరుణ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆదివాసీ హక్కులు సాధించేందుకు కమిటీలు వేసి భవిష్యత్తు కార్యాచరణ, ప్రణాళిక సిద్ధం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బుర్స పోచయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేశ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట్నాక విజయ్‌కుమార్, నాయకులు గుర్రాల రవీందర్, మెస్రం మోతీరాం, పుర్క బాబురావు, కోట్నాక ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తొలిరోజు 6,186 దరఖాస్తులు

- జిల్లా వ్యాప్తంగా 'ప్రజా పాలన' షురూ
- అర్హులందరికీ ఆరు గ్యారంటీలు : కలెక్టర్ హేమంత్ బోర్కడే


జిల్లా కేంద్రంలో దరఖాస్తులు పరిశీలిస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే



కౌటాల జిరాక్స్ కేంద్రం వద్ద దరఖాస్తుదారులు

ఆసిఫాబాద్: జిల్లాలో మొదటిరోజు ప్రజా పాలన కార్యక్రమానికి విశేష స్పందన వచ్చింది. జిల్లాలోని 335 గ్రామ పంచాయతీలు, కాగజ్‌నగర్ మున్సిపాలిటీ ఉంది. తొలిరోజు 6,186 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ హేమంత్ బోర్కడే వెల్లడించారు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో 3,079 దరఖాస్తులు రాగా.. ఆసిఫాబాద్‌లో 172, బెజ్జూర్ 201, చింతలమానెపల్లి 232, దహెగాం 126, జైనూర్ 55, కాగజ్‌నగర్‌రూరల్ 538, కెరమెరి 193, కౌటాల 183, లింగాపూర్ 56, పెంచికల్‌పేట్ 131, రెబ్బెన 230, సిర్పూర్(టి) 160, సిర్పూర్(యూ) 84, తిర్యాణి 25, వాంకిడి 721 దరఖాస్తులు వచ్చాయి. పలు మండలాల్లో దరఖాస్తుల కోసం ప్రజలు జిరాక్స్ సెంటర్ల వద్ద బారులు తీరారు.

జిల్లా కేంద్రంలో కలెక్టర్ పరిశీలన

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమంలో అర్హులందరికీ ఆరు గ్యారంటీ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం ప్రజా పాలన కార్యక్రమం పరిశీలించారు. కలెక్టర్ దరఖాస్తుల స్వీకరణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని కాగజ్‌నగర్ మున్సిపాలిటీతోపాటు గ్రామ పంచాయతీల వారీగా లబ్ధిదారులను గుర్తిస్తామని తెలిపారు. దరఖాస్తుదారులు ముందుగానే దరఖాస్తులు నింపి స్వీకరణ కౌంటర్‌లో అందించాలని సూచించారు. దరఖాస్తులో పూర్తిగా నిజమైన సమాచారం పొందుపర్చాలని, తద్వారా అర్హత కలిగిన వారికి న్యాయం జరుగుతుందన్నారు. మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకాలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని పేర్కొన్నారు. దరఖాస్తు ఫారంతోపాటు ఆధార్‌కార్డు, తెల్లరేషన్ కార్డు జిరాక్స్‌లు జతపర్చాలని, దరఖాస్తుదారులకు రశీదు అందజేస్తామని పేర్కొన్నారు.

బీజేపీ రాష్ట్రస్థాయి సమావేశంలో 'పాల్వాయి'


అమిత్ షాకు నమస్కరిస్తున్న హరీశ్‌బాబు

కౌటాల(సిర్పూర్): హైదరాబాద్‌లో గురువారం బీజేపీ రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరై పార్లమెంట్ ఎన్నికలపై దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌లో రైళ్లు ఆపాలని వినతి..

కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో పలు రైళ్లు ఆపాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ భారతేశ్ కుమార్ జైన్‌ను కలిసి వినతిపత్రం అందించారు. సికింద్రాబాద్ నుంచి కాగజ్‌నగర్ వరకు సాయంత్రం ప్రతిరోజూ కొత్త రైలు నడపాలని, ఆ రైలుకు కుమురం భీం ఎక్స్‌ప్రెస్‌గా నామకరణం చేయాలని కోరారు. బెంగాలీలకు పశ్చిమ బెంగాల్ వెళ్లడానికి సికింద్రాబాద్ నుంచి హౌరా వయా సిర్పూర్ కాగజ్‌నగర్ వారానికి ఒక రోజు నడపాలని, కాజీపేట– అజ్ని ప్యాసింజర్ పునరుద్ధరించాలన్నారు. కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌లో లిఫ్ట్ సౌకర్యం, వైఫై ఏర్పాటు చేయాలని, సంజీవయ్య కాలనీలో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని, వేంపల్లి రైల్వేగేట్ వద్ద ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని వేగవంతం చేయాలని కోరారు.

సేవలు మెరుగు.. సిబ్బంది కరువు

- జిల్లా కేంద్రంలో నూతనంగా ప్రభుత్వ వైద్య కళాశాల
- అందుబాటులోకి వచ్చిన డయాలసిస్ కేంద్రాలు
- పీహెచ్‌సీల్లో మహిళా ఆరోగ్య కేంద్రాలు ప్రారంభం
- 2023లో మెరుగుపడిన వైద్యసేవలు
- భర్తీకాని వైద్యులు, సిబ్బంది పోస్టులు




జిల్లా కేంద్రంలోని అంకుసాపూర్ శివారులో ఏర్పాటు చేసిన వైద్య కళాశాల


దహెగాంలో మహిళా ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు(ఫైల్)

ఆసిఫాబాద్: జిల్లాలో ఈ ఏడాది వైద్య సేవల్లో గణనీయమైన పురోగతి కనిపించింది. వెనుకబడిన కుమురంభీం జిల్లాలో గత ఏడాదితో పోల్చితే 2023లో వైద్య సేవలు మెరుగయ్యాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో వైద్యసేవలు మరింత మెరుగుపడాల్సి ఉంది. అయితే మాతాశిశు మరణాలు అరికట్టడం, ఆస్పత్రుల్లో ప్రసవాలు పెంచడం, రక్తహీతనను తగ్గించడం, విష జ్వరాల కట్టడి.. తదితర అంశాలపై వైద్యశాఖ దృష్టి సారించాల్సి ఉంది. జిల్లా కేంద్రంలో వై ద్య కళాశాల ఏర్పాటుతోపాటు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని 50 పడకల నుంచి 330 పడకల స్థాయికి పెంచారు. కాగజ్‌నగర్ ఆస్పత్రిని వంద పడకల స్థాయికి పెంచారు. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణాల్లో డయాలసిస్ కేంద్రాలు ప్రారంభం కాగా.. రేడియాలజీ ల్యాబ్, తెలంగాణ డయాగ్నొస్టిక్ సెంటర్‌లో పరీక్షల సంఖ్యను పెంచారు.

'మెడికల్' తరగతులు షురూ

జిల్లా కేంద్రంలోని అంకుసాపూర్ శివారులో ఈ ఏడాది కొత్తగా వైద్య కళాశాల ఏర్పాటైంది. భవనాన్ని మొత్తం 45 గదులతో నిర్మించారు. ఎంబీబీఎస్ తరగతుల ప్రారంభానికి జాతీయ వైద్య మండలి(ఎన్‌ఎంసీ) అనుమతులు మంజూరు చేయడంతో సెప్టెంబర్ 15న అప్పటి సీఎం కేసీఆర్ వర్చువల్‌గా కళాశాలను ప్రారంభించారు. మొదటి సంవత్సరంలో 100 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పించారు. నీట్ యూజీ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులకు రెండు దశల కౌన్సెలింగ్‌లో సీట్లు కేటాయించారు. రాష్ట్ర కోటాలో 85 మంది, ఆల్ఇండియా కోటా కింద 15 మంది విద్యార్థులు ప్రవేశం పొందారు. బాలబాలికలకు వేర్వేరుగా వసతి కోసం జిల్లా కేంద్రంలోని పాత ఎస్పీ, డీఆర్‌డీఏ కార్యాలయాలను కేటాయించారు.

ఏళ్ల నిరీక్షణ.. డయాలసిస్ కేంద్రం

జిల్లా ప్రజలు డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. వారి నిరీక్షణకు తెరదించుతూ కాగజ్‌నగర్‌లో ఒకటి, జిల్లా కేంద్రంలో మరో డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించారు. కాగజ్‌నగర్‌లో సేవలు కొనసాగుతుండగా ఆసిఫాబాద్‌లో జూన్ 14న ప్రారంభించారు. ఒక్కో కేంద్రంలో ఐదు డయాలసిస్ మిషన్లు ఏర్పాటు చేశారు. ఆరుగురు టెక్నీషియన్లు విధులు నిర్వర్తిస్తున్నారు. రోగులకు ప్రతిరోజూ మూడు షిఫ్టుల వారీగా డయాలసిస్ చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో నాలుగు షిఫ్టులు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ 15 మందికి రక్తశుద్ధి చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 72 మంది డయాలసిస్ పేషెంట్లు ఉండగా, కాగజ్‌నగర్ 38 మంది, ఆసిఫాబాద్ 32 మంది ఉన్నారు.

సిబ్బంది కొరత

నూతన వైద్య కళాశాలలో ఇప్పటికీ అవసరమైన సిబ్బందిని నియమించలేదు. 50 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 384 మంది సిబ్బంది అవసరముంది. 19 డిపార్ట్‌మెంట్లు వేర్వేరుగా ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే ప్రభుత్వం కేవలం 22 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అనాటమీ, ఫిజియాలజీ, బయో కెమిస్ట్రీ ప్రాథాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగాలకు ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్ చొప్పున కేటాయించారు. జనరల్ సర్జరీ విభాగంలో నలుగురు, జనరల్ మెడిసిన్‌కు ముగ్గురు, పీడియాట్రిక్స్ ఇద్దరు, ఫిజియాట్రీకి ఒకరు, రేడియోగ్నాసిస్‌కు ఒకరు, ఆర్థోపెడిక్స్ ఒకరు, ఓబీజీ విభాగంలో ఇద్దరు, అనస్థిషియాకు ముగ్గురు చొప్పున అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించారు. ఇప్పటివరకు ఒక ఆర్థోపెడిక్, ఒక గైనిక్, ఒక సైకాలజిస్టు మాత్రమే విధుల్లో చేరారు. అరకొర సిబ్బందితోనే విద్యార్థులకు బోధన సాగుతోంది.

73 మంది పల్లె వైద్యులు

గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు మెరుగుపర్చడంలో భాగంగా 118 సబ్ సెంటర్లలో కొత్తగా నలుగురు కాంట్రాక్టు వైద్యులు, 73 మంది పల్లె వైద్యులను నియమించారు. పల్లె వైద్యులు నిత్యం సబ్ సెంటర్లలో ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు.

330 పడకలకు అప్‌గ్రేడ్

మెడికల్ కాలేజీకి అనుబంధంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని 330 పడకలకు అప్‌గ్రేడ్ చేయగా.. భవన నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఫస్టియర్ ఎంబీబీఎస్ విద్యార్థులకు అవసరమైన లెక్చర్ హాల్(తరగతి గది)తోపాటు అనాటమీ(శరీర నిర్మాణ శాస్త్రం) విభాగంలో డీసెక్షన్ హాల్(శరీర విచ్ఛేదనం), రెండు డెమో రూములు, హిస్టాలజీ ల్యాబ్.. బయో కెమిస్ట్రీ విభాగంలో స్టూడెంట్ రూం, రీసెర్చ్ ల్యాబ్, డెమో రూం, ఫిజియాలజీకి సంబంధించిన రెండు ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు.

భర్తీ కాని పోస్టులు

సేవలు మెరుగుపడినా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టులు భర్తీ కాలేదు. ఆస్పత్రిలో ఇన్‌చార్జి డీసీహెచ్ కొనసాగుతున్నారు. 53 మంది వైద్యులకు ప్రస్తుతం 11 మంది పని చేస్తున్నారు. వీరిలో ఒకరు అనస్థిషియా వైద్యులు, ఒకరు ఈఎన్‌టీ, నలుగురు పిల్లల వైద్యులతోపాటు ఐదుగురు సాధారణ వైద్యులు ఉన్నారు.

ఆరోగ్య మహిళా కేంద్రాలు

ఈ ఏడాది కొత్తగా గిన్నెధరి, దహెగాం, పెంచికల్‌పేట్, కౌటాల పీహెచ్‌సీల్లో ఆరోగ్య మహిళా కేంద్రాలను ప్రారంభించారు. ఈ కేంద్రాల్లో మహిళా వైద్యులే సేవలందిస్తున్నారు. ప్రతీ మంగళవారం మహిళలకు క్యాన్సర్, షుగర్, బీపీ.. ఇతర వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు.

క్లుప్తంగా

పెద్దపల్లి పార్లమెంట్ బీఎస్పీ ఇన్‌చార్జిగా రవీందర్


కాదాసి రవిందర్

శ్రీరాంపూర్: బీఎస్పీ పెద్దపల్లి పార్లమెంటు నియోజకవర్గం ఇంచార్జిగా శ్రీరాంపూర్‌కు చెందిన కాదాసి రవీందర్‌ను నియమించారు. ఈ మేరకు గురువారం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. తనపై నమ్మకంతో నియోజకవర్గం ఇంచార్జిగా నియమించినందుకు రవీందర్ పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు

ఆనంద నిలయంలో బాలుడు..


వికాస్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఒంటరిగా ఉన్న బాలుడిని పోలీసుశాఖ 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బందికి అప్పగించారని, ఆ బాలుడి ఆచూకీ తెలిసిన వారు, సంబంధికులు ఉంటే సంప్రదించాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి చిన్నయ్య తెలిపారు. ఆరేళ్ల వయస్సు కలిగిన వికాస్ అనే బాలుడు ఈ నెల 17వ తేదీన ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఒంటరిగా ఉండగా పోలీసులు గుర్తించి తమకు అప్పగించడంతో ఆ బాలుడిని సిడబ్ల్యూసీ ఆదేశాల మేరకు తాత్కాలిక వసతి కోసం ఐఆర్‌సీఎస్ ఆనంద నిలయంలో చేర్చడం జరిగిందన్నారు. బాలుడి సంబంధిత వ్యక్తులు ఎవరైనా తగిన ధృవపత్రాలతో బాల రక్షాభవన్‌లో ఈ నెల 30వ తేదీలోగా సంప్రదించాలని కోరారు. ఆ తరువాత ఆ బాలుడిని ఆదిలాబాద్‌లోని శిశుగృహానికి తరలించినున్నట్లు వివరించారు. వివరాలకు 9441506519, 7032462331 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ కార్యవర్గం

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని ఇల్లందు క్లబ్‌లో గురువారం జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా సుభాష్, ఉపాధ్యక్షుడిగా లాల్‌బాయ్, ప్రధాన కార్యదర్శిగా అబ్దుల్ అజార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా ప్రవీణ్‌నాయక్, జాయింట్ సెక్రెటరీగా జ్యోతి, కోశాధికారిగా సతీష్ ఎన్నికయ్యారు. నూతన కమిటీకి ఎన్నికల అధికారి ప్రశాంత్ ధ్రువీకరణ పత్రాలు అందజేసి అభినందించారు. ఫారెస్ట్ స్టాఫ్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కమిటీ తెలిపింది.

జిల్లా ప్రధాన కార్యదర్శిగా తిరుపతి


పత్రం అందుకుంటున్న తిరుపతి

జన్నారం: జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలంలోని కవ్వాల్ గ్రామానికి చెందిన అమరగొండ తిరుపతి నియామకం చేశారు. మంచిర్యాలలో జరిగిన జిల్లా సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు మొగుళ్ల భద్రయ్య తిరుపతికి నియామక పత్రం అందజేసినట్లు తెలిపారు. తనపై నమ్మకంతో ఈ పదవి ఇచ్చిన రాష్ట్ర కమిటీకి ధన్యవాదాలు తెలిపారు.

మెరుగుపడిన వైద్య సేవలు..

- జిల్లాకు టీహబ్ సేవలు ప్రారంభం
- మెడికల్ కళాశాల, ఆసుపత్రి నిర్మాణ పనులు ప్రారంభం
- మోకీలు మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతం
- ఏసీబీకి చిక్కిన డీఎంహెచ్‌వో కార్యాలయ ఉద్యోగులు
- కొంత ఖేధం, కొంత మోధంతో ఏడాది పూర్తి




మిషన్ ఇంద్రధనుష్‌లో చిన్నారులకు టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

మంచిర్యాలటౌన్: జిల్లాలో 2023 సంవత్సరంలో ప్రభుత్వ వైద్య సేవలు మెరుగుపడ్డాయి. గతంతో పోలిస్తే, ఈ ఏడాది ప్రభుత్వ ఆసుపత్రులను పెంచారు. 17 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అనుబంధంగా ఉన్న 121 ఉప కేంద్రాలను పల్లె దవాఖానాలుగా మార్చి వైద్యులను నియమించారు. వీటితో పాటు పట్టణ ఆరోగ్య కేంద్రాలు 4 ఉండగా, వాటికి ఉపకేంద్రాలు 28 ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్యం కోసం చేపట్టిన పలు కార్యక్రమాలు సైతం జిల్లాలో విజయవంతం అయ్యాయి. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఈ ఏడాది మోకీలు మార్పిడి శస్త్ర చికిత్సను చేసి వైద్యులు విజయం సాధించారు. ఆగస్టు 22వ తేదీన అత్యాధునికంగా సిద్ధం చేసిన నవజాత శిశువు అంబులెన్సును జిల్లాకు ప్రభుత్వం అందించింది. బెల్లంపల్లిలో 100పడకల ఆస్పత్రిని ప్రారంభించారు. కానీ సరిపడా వైద్య సిబ్బంది లేరు.

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల గుర్తింపు

అసాంక్రమిక వ్యాధుల సమగ్ర ఆరోగ్య పరీక్షలు(ఎన్‌సిడి) కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా 3,59,507 మందిని పరీక్షించగా 43,384 మందికి బీపి, 15,868 మందికి మధుమేహం, 186 మందికి క్యాన్సర్‌లో బ్రెస్ట్ క్యాన్సర్ 102 మందికి, సెర్విక్స్ క్యాన్సర్ 53 మందికి, ఓరల్ క్యాన్సర్ 31 మందికి ఉన్నట్లుగా గుర్తించారు.

ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు మెరుగు

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలను పెంచడంతో పాటు, సిజేరియన్లను తగ్గించేందుకు చేపట్టిన పలు కార్యక్రమాలు విజయవంతం అయ్యాయి. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ ప్రైవేటుల్లో 7,061 ప్రసవాలు జరగ్గా, 3,731 ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో, 3,330 ప్రసవాలు ప్రైవేటులో జరిగాయి.

ఆరోగ్య మహిళా క్లినిక్‌లు సక్సెస్

జిల్లాలో మహిళా క్లినిక్‌ల ద్వారా అన్ని రకాల వైద్య పరీక్షలను నిర్వహించారు. 11,928 మందికి వైద్య పరీక్షలు చేయగా 42 మంది అనుమానితుల్లో నుంచి 17మందిని రెఫర్ చేసి ఏడుగురికి వైద్యం చేశారు. బ్రెస్ట్ క్యాన్సర్ ఉన్న 36 మందికి చికిత్స అందించారు. సెర్వికల్ క్యాన్సర్ ఉన్న 24మందికి చికిత్స అందించారు. 13,640 మందిని పరీక్షించగా 536 మందికి హైపర్ థైరాయిడ్, 1,540 మందికి మెనోపాజ్ సమస్యలు, 576 మందికి యూరిన్ ఇన్‌ఫెక్షన్ అయినట్లు గుర్తించి వైద్యం అందించారు.

గర్భిణులకు న్యూట్రీషన్ కిట్లు

గర్భిణుల్లో రక్తహీనత, మాతాశిశు మరణాల శాతం తగ్గించేలా, పుట్టే పిల్లల్లో పౌష్టికాహార లోపం నిర్ధారణకు గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లను ఈ ఏడాది మే నెలలో ప్రభుత్వం ప్రారంభించింది. జిల్లా వ్యాప్తంగా 6,900ల మందికి న్యూట్రీషన్ కిట్లు అందించారు.

టీహబ్‌తో 134 రకాల వైద్య పరీక్షలు

తెలంగాణ డయాగ్నోస్టిక్స్ కేంద్రం(టీహబ్)ను ఈ ఏడాది జులై 1వ తేదీన ప్రారంభించారు. ఇందులో 134 రకాల వైద్య పరీక్షలను చేసేందుకు దీనిని ఏర్పాటు చేశారు. పూర్తిస్థాయిలో వైద్య సిబ్బంది లేక ఇబ్బందిగా మారింది.

కంటి వెలుగు పరీక్షలు


కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ బదావత్ సంతోశ్(ఫైల్)

ఈ ఏడాది జనవరి 19వ తేదీన జిల్లాలో ప్రారంభించిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం ద్వారా 4,11,081 మందికి కంటి పరీక్షలను నిర్వహించగా, కంటి సమస్య కొంచెం ఉన్నవారిలో 68,924 మందిని గుర్తించి, వారికి రీడింగ్ గ్లాస్‌లను అందించారు. కంటి సమస్య ఎక్కువ ఉన్నవారిలో 61,463 మందిని గుర్తించగా, అందులో ప్రిస్క్రిప్షన్ గ్లాసెస్‌ను 58,632 మందికి అందించగా, 2,831 మందికి ఇవ్వాల్సి ఉంది.

అవినీతి మరకలు

జిల్లావైద్య ఆరోగ్య శాఖకు ఈ ఏడాది అవినీతి మరక అంటుకుంది. ఈ ఏడాది జూన్ 13వ తేదీన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో పనిచేసిన సూపరింటెండెంట్ షఫియొద్దీన్, సీనియర్ అకౌంటెంట్ దీపిక, అకౌంటెంట్ రాజనర్సులు రూ. 10వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు.

ఐఎన్టీయూసీ కొంపముంచిన చేరికలు

- టీబీజీకేఎస్ నేతల రాకతో కార్మికుల్లో వ్యతిరేకత
- ఓట్లపై తీవ్ర ప్రభావం
- ఎమ్మెల్యే కృషితోనే ఈ మాత్రం ఓటు బ్యాంక్

శ్రీరాంపూర్: అడ్డగోలు చేరికలు సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ఐఎన్టీయూసీ కొంప ముంచాయి. సింగరేణిలో ఆరు డివిజన్లలో గెలిచిన ఐఎన్టీయూసీకి శ్రీరాంపూర్‌లో కూడా గెలుపు అవకాశాలు ఉంటాయని ఎన్నికలకు కొద్ది రోజులు ముందు ఆ యూనియన్ నేతలు భావించారు. కానీ ఫలితాలు తారుమారయ్యాయి. కార్మికుల్లో తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకున్న టీబీజీకేఎస్ నేతలను వెనుకాముందు చూసుకోకుండా పెద్దయెత్తున చేర్చుకోవడం ఐఎన్టీయూసీ ఓటమికి కారణమైందనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. టీబీజీకేఎస్‌లో ఏర్పడ్డ నాయకత్వ సంక్షోభంతో శ్రీరాంపూర్ ఏరియాలో బ్రాంచీ ముఖ్య నేతలు, ఫిట్ సెక్రెటరీలు, పలువురు నాయకులు ఎన్నికలకు కొద్ది రోజుల ముందే ఐఎన్టీయూసీలో చేరారు. వీరిలో కొందరు అధికారంలో ఉన్నప్పుడు వ్యవహరించిన తీరు, ప్రదర్శించిన అధికార దర్పం వల్ల కార్మికుల్లో తీవ్ర వ్యతిరేకత మూటగట్టుకున్నారు. కొందరికి అవినీతి మరకలున్నాయి. వారే మళ్లీ అధికారం కోసం ఐఎన్టీయూసీలో చేరారని, ఇక ఐఎన్టీయూసీ గెలిచిన కూడా మళ్లీ పాతకథే పునరావృతం అవుతుందని భావించి ఐఎన్టీయూసీకి వ్యతిరేక ఓటు వేసినట్లు కొందరు కార్మికులు బాహాటంగానే పేర్కొంటున్నారు. ఐఎన్టీయూసీ మొదటి నుంచి పనిచేసిన నేతలు కూడా టీబీజీకేఎస్ నుంచి వచ్చిన కొందరి ముఖ్య నాయకుల పట్ల తీవ్ర వ్యతరేకతతోనే ఉన్నారని తెలిసింది. టీబీజీకేఎస్ కీలక పదవులు అనుభవించి, అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న ముఖ్య నాయకులను పక్కన పెట్టి, క్లీన్ ఇమేజ్ ఉన్న నేతలు, కింది స్థాయి కార్యకర్తలను మాత్రమే చేర్చుకుని ఉంటే ఈ ఎన్నికల్లో మంచి ఫలితాలు వచ్చేవని ఐఎన్టీయూసీ కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు.

ఎమ్మెల్యేకు ఇష్టం లేకున్నా..

టీబీజీకేఎస్‌లో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని చేర్చుకోవడం మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావుకు మొదటి నుంచీ ఇష్టం లేదు. కార్మికుల్లో వ్యతిరేకత ఉన్న ముఖ్య నేతలను చేర్చుకోవద్దని పలుమార్లు యూనియన్ నాయకత్వాన్ని హెచ్చరిస్తూ వచ్చారు. ఐఎన్టీయూసీ నాయకత్వం వారినే చేర్చుకుంది. ఎమ్మెల్యే అసెంబ్లీ సమావేశాలకు హైదరాబాద్‌కు వెళ్లి వచ్చేలోపే ఈ చేరికలు జరిగాయి. దీనిపై ఆయన ఒకింత ఆగ్రహం వ్యక్తం కూడా చేశారని తెలిసింది. చివరికి యూనియన్ గెలుపుపై దృష్టి పెట్టి ప్రచారం రంగంలో దిగారు. సమావేశాలు ఏర్పాటు చేయడం, పార్టీ కార్యకర్తలను కూడా రంగంలోకి దించి గనుల వారీగా కార్మికులను కలిసి వారికి ఐఎన్టీయూసీని గెలిపిస్తే ఎన్నికల మేనిఫెస్టోను అమలు చేయించే బాధ్యత తనది అంటూ భరోసా ఇచ్చారు. దీంతో కాస్త బలం పెరిగింది. క్రితం 6వ దఫా ఎన్నికల్లో పోటీ కూడా చేయలేని దుస్థితిలో ఉన్న ఐఎన్టీయూసీకి నేడు ఈ ఎన్నికల్లో 2,690 ఓట్లు రావడం ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ప్రభావమేనని ఆ యూనియన్ వారు పేర్కొంటున్నారు. టీబీజీకేఎస్ చేరికలతో బలపడుతామనుకొన్న ఐఎన్టీయూసీ నాయకత్వానికి ఈ చేరికలే ఎన్నికల్లో కొంప ముంచాయనేది నగ్న సత్యం.

బొగ్గుచోరీ పేరిట.. జేసీబీ, లారీలు స్వాధీనం


ఎస్‌అండ్‌పీసీ ఆఫీస్ ఆవరణలోని జేసీబీ


కేకే-1 కాంట వద్ద లారీలు

- గోప్యంగా ఉంచిన అధికారులు
- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయని వైనం

మందమర్రిరూరల్: బొగ్గుచూరను దొంగిలించుకుపోతున్నారనే సమాచారంతో అధికారులు జేసీబీ, రెండు లారీలను నాలుగు రోజుల క్రితం పట్టుకున్నారు. కానీ నేటికీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయలేదు. ఈ విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. స్థానికుల వివరాల ప్రకారం... నాలుగు రోజుల క్రితం మందమర్రి ఏరియాలోని ఆర్కే 1ఏ సమీపంలో (పాతఆర్యన్ కంపెనీ కోల్ వాషర్ ప్లాంట్) బొగ్గు చూరను దొంగతనంగా తరలించుకుపోతున్నారనే సమాచారంతో ఏరియా క్వాలిటీ అధికారి, సెక్యూరిటీ అధికారులు అక్కడికి వెళ్లారు. జేసీబీతో పాటు రెండు లారీలు కనిపించడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. జేసీబీని మందమర్రి ఏరియా ఎస్‌అండ్‌పీసీ ఆఫీస్‌లో, రెండు లారీలను కేకే-1 కాంట వద్ద ఉంచారు. ఈ విషయమై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయలేదు. అలాగే ఉన్నతాధికారులకు సైతం సమాచారం అందించలేదు. లావాదేవీల కోసమే అధికారులు ఈ తతంగం నడిపిస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై సాక్షి క్వాలిటీ అధికారిని వివరణ కోరగా.. మళ్లీ కాల్ చేస్తానని దాటవేశాడు. సదరు యజమాని తన జేసీబీ, లారీలను అక్రమంగా సింగరేణి అధికారులు స్వాధీనం చేసుకున్నారని రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

కార్మికులకు అండగా ఉంటాం


ఉద్యోగులతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

రెబ్బెన: ఏరియాలో పని చేస్తున్న కార్మికులకు ఎల్లవేళలా అండగా ఉంటూ హక్కుల సాధన కోసం పోరాడుతామని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్ రావు అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో బెల్లంపల్లి ఏరియాలో ఏఐటీయూసీని గెలిపించిన కార్మికులను గురువారం టీబీజీకేఎస్ నాయకులు కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు మాట్లాడారు. ఏరియాలో టీబీజీకేఎస్ మద్దతు తెలిపిన ఏఐటీయూసీ ఏరియాలో 122 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించటం శుభపరిణామమన్నారు. ఏఐటీయూసీ గెలుపునకు కృషి చేసిన టీబీజీకేఎస్ ఏరియా నాయకులు, కార్యకర్తలకు, ఓటు వేసిన గెలిపించిన కార్మికులందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నామని తెలిపారు. ఏరియాలో పనిచేసే కార్మికులకు ఎలాంటి కష్టం వచ్చిన టీబీజీకేఎస్ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏరియా నాయకులు చంద్రశేఖర్, మారిన వెంకటేష్, మాజీ ఏరియా ఉపాధ్యక్షుడు నల్లగొండ సదాశివ్, నాయకులు అలవేణి సంపత్, రవీందర్, మాంకయ్య, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికుల ధర్నా


ఆందోళన చేపడుతున్న పారిశుధ్య కార్మికులు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ మున్సిపల్ కార్యాలయం ఎదుట గురువారం మున్సిపల్ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు, ఎన్ఎంఆర్ కార్మికులు ధర్నాకు దిగారు. తమకు నెలనెలా వేతనాలు చెల్లించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ డబ్బులు కార్మికుల ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ, పీఎఫ్ డబ్బులు కార్మికుల ఖాతాలో జమ చేసేందుకు అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారని, వేతనాలు అందక తాము తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పారిశుధ్య పనులకు వెళ్లకుండా కార్మికులు తెల్లవారు జామున 5గంటలకు బల్దియా కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. సమాచారం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ అంజయ్య అక్కడికి చేరుకొని కార్మికులను నచ్చజెప్పారు. వేతనాలు చెల్లింస్తామని, ఈఎస్ఐ, పీఎఫ్ డబ్బులు వారి ఖాతాల్లో జమ చేస్తామని స్పష్టమైన హామీ ఇవ్వడంతో కార్మికులు ధర్నా విరమించారు.

నాగ్‌పూర్ సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు


సభకు వెళ్లడానికి సిద్ధమైన శ్రేణులు

బెల్లంపల్లి: మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో జరిగే కాంగ్రెస్ ఆవిర్భావ సభకు గురువారం బెల్లంపల్లి నుంచి కాంగ్రెస్ శ్రేణులు బయలుదేరి వెళ్లారు. బజారు ఏరియాలోని పట్టణ కాంగ్రెస్ కార్యాలయం వద్ద నుంచి ప్రత్యేక బస్సుల్లో నాయకులు కాంగ్రెస్ ఆవిర్భావ సభకు తరలివెళ్లారు. అంతకు ముందు కాంగ్రెస్ కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య పతాకావిష్కరణ చేశారు.

భీమిని: కన్నెపల్లి, భీమిని మండలాల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగ్‌పూర్ సభకు తరలివెళ్లారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాదవరపు నర్సింగరావు, కన్నెపల్లి, భీమిని మండలాల అధ్యక్షులు రామాంజనేయ ఉన్నారు.

వేమనపల్లి: మండలం నుంచి ఎంపీటీసీ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో నాయకులు తరలివెళ్లారు.

ఈకేవైసీ కోసం దరఖాస్తులు


గ్యాస్ కేంద్రం వద్ద కేవైసీ కోసం వేచి ఉన్న ప్రజలు

లక్సెట్టిపేట: ప్రభుత్వం ప్రవేశపెట్టిన సబ్సిడీ గ్యాస్ కోసం ఈకేవైసీ దరఖాస్తుల కోసం లబ్ధిదారులు ఇండేన్ గ్యాస్ కేంద్రం వద్ద బారులు తీరారు. ఉదయం నుంచి మహిళలు పెద్ద ఎత్తున క్యూలో ఉంటూ ఇబ్బందులు పడుతున్నారు. ఈకేవైసీ తీసుకోవడంతో లబ్ధిదారులకు గ్యాస్ సబ్సిడీ వస్తుందని తెలియడంతో మహిళలు ఉదయం నుంచి గ్యాస్ కేంద్రం వద్ద బారులు తీరుతున్నారు.

గంజాయి విక్రయిస్తే చర్యలు


మాట్లాడుతున్న సీఐ నరేందర్, పక్కన ఎస్సై రమేష్

రెబ్బెన(ఆసిఫాబాద్): ప్రభుత్వం నిషేధించిన గంజాయిని పండించినా, రవాణా చేసినా, సేవించినా కఠిన చర్యలు తప్పవని సీఐ అల్లం నరేందర్ హెచ్చరించారు. తిర్యాణి మండలంలోని కైరిగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని లచ్చుగూడ గ్రామానికి చెందిన ఆత్రం లింగారావు తన పెరటిలో పండిస్తున్న గంజాయి మొక్కలను తిర్యాణి ఎస్సై గురువారం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ మేరకు తిర్యాణి పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో సీఐ వివరాలు వెల్లడించాడు. లచ్చుగూడలో అక్రమంగా గంజాయి మొక్కలు సాగుచేస్తున్నారనే సమాచారంతో తిర్యాణి ఎస్సై సీహెచ్ రమేష్ సిబ్బందితో కలిసి తహసీల్దార్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించాడు. లింగారావు ఇంటివెనుక భాగంలోని పెరటిలో గంజాయి మొక్కలు గుర్తించాడు. పంచనామా నిర్వహించి నిందితుడి నుంచి ఐదు గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకుని వాటిని తూకం వేయగా సుమారు 9కిలోల బరువు ఉన్నట్లు తేలిందన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు వివరించారు. సమావేశంలో ఎస్సై రమేష్ ఉన్నారు.

బావిలో పడి వివాహిత మృతి

జన్నారం: ప్రమాదవశాత్తు బావిలోపడి వివాహిత మృతి చెందిన ఘటన జన్నారం మండలం రేండ్లగూడలో చోటు చేసుకుంది. ఎస్సై సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. జన్నారం మండలం రేండ్లగూడ గ్రామానికి చెందిన నెల్కి సత్తవ్వ(35) భర్త శ్రీనివాస్‌తో కలిసి గురువారం తన వ్యవసాయ బావి వద్దకు గడ్డికట్టలు కట్టెందుకు వెళ్లింది. అనంతరం బావి సమీపంలో అనుమతీగ కాయలు తెంపుతున్న క్రమంలో సత్తవ్వ కాలికి తీగ తట్టుకుని ప్రమాదవశాత్తు బావిలో పడిపోయింది. భర్త రక్షించే ప్రయత్నం చేసిన ఫలితం లేదు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని బావిలో నుంచి బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం లక్షెట్టిపేట ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తండ్రి బత్తుల మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి 14ఏళ్ల కూతురు ఐశ్వర్య, పదేళ్ల కొడుకు అర్పిత్ ఉన్నారు.

పంట చేలల్లోకి చిరుత

- పంట పొలాలకు వెళ్లేందుకు జంకుతున్న కూలీలు


మిరప తోటలో చిరుత పాదముద్రలు

వేమనపల్లి: మండల కేంద్రం శివారులోని ఏరుమద్దులు, కొత్తపల్లివాగు పంట చేళ్ల వైపు చిరుత పులి సంచరిస్తుంది. గ్రామానికి చెందిన గూడె అశోక్‌కు తన మిర్చి తోట నుంచి మూడు రోజుల క్రితం చిరుత వెళ్లినట్లు గుర్తించాడు. మిర్చీ తోటకు నీటి తడులు ఇచ్చి ఇంటికి వచ్చాడు. రాత్రిపూట మిర్చి తోటలో తిరిగి పక్కన ఉన్న పత్తి చేళ్ల గుండా కొత్తపల్లి వాగు దాటి గొర్లపల్లి, కల్మలపేట శివారులోకి వెళ్లి ఉండొచ్చని అధికారులు, రైతులు అనుమానిస్తున్నారు. రైతుల సమాచారం మేరకు అటవీ, బేస్ క్యాంపు సిబ్బంది మిర్చి తోట వైపు వెళ్లి పంచనామా చేశారు. పాదముద్రలు సేకరించారు. పత్తి సేకరణకు వెళ్లే రైతులు చిరుత సంచారంతో చేనులకు వెళ్లేందుకు జంకుతున్నారు. అటవీ అధికారులు చిరుత సంచారంపై సమగ్ర పరిశీలన చేసి ఎటు వెళ్లింది? ఏమైన రక్షణ చర్యలు పాటించాలా? అనే విషయాలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పందుల జాడ పసిగట్టి..

పత్తి పంట సీజన్ కావడంతో అడవి పందులు మేత కోసం పత్తి, వరి పొలాల వైపు వస్తున్నాయి. వీటిని వేటాడేందుకు చిరుత పులి పందుల జాడ పసిగట్టి చేళ్ల వైపు వచ్చినట్లు స్థానికులు తెలుపుతున్నారు. ఏరుమద్దులు, ప్రాణహిత తీరం, కొత్తపల్లి, నీల్వాయి వాగు పుష్కలంగా నీటి వనరులు ఉన్నాయి. ఈ ప్రాంతంలోనే పత్తి పంట ఉంది. అడవి పందులు సైతం ఈ ప్రాంతంలో మకాం పెట్టడంతో చిరుతకు అనువైన మేత లభ్యమవుతుంది. గత ఎనిమిది నెలల క్రితం కళ్లంపల్లి, ముక్కిడిగూడ, దస్నాపూర్ అటవీ ప్రాంతాల్లో చిరుత పులులు సంచరిస్తున్నాయి. మేకలు, ఆవులు సైతం పొట్టనపెట్టుకున్నాయి. చిరుత ఆహార అన్వేషణలో భాగంగా పంట చేళ్ల వైపు వచ్చి ఉండవచ్చని అభిప్రాయం వ్యక్తమవుతోంది.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక


సుప్రిత్‌రెడ్డిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

జన్నారం: మండల కేంద్రంలోని స్లేట్ ఎక్సలెన్స్ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి ఏనుగు సుప్రిత్‌రెడ్డి జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు స్లేట్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ ఏనుగు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 23 నుంచి 25వరకు వరంగల్ జిల్లా తొర్రూర్‌లో జరిగిన అండర్-14 విభాగం రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చడంతో ఎంపిక చేశారని పేర్కొన్నారు. త్వరలో తమిళనాడులో జరిగే జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. విద్యార్థిని చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యాయులు సంతోష్, నగేశ్, నాగలక్ష్మీ, రమేశ్, కృష్ణ అభినందించారు.

నిబంధనలు పాటించని యువత

- విచ్చలవిడిగా బైక్ రైడ్‌లు
- శబ్దాలతో ప్రజలు ఇబ్బందులు
- ట్రాఫిక్‌తో నానా అవస్థలు
- పలు రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాత
- పట్టించుకోని అధికారులు


ఒక బైక్‌పై నలుగురు యువకులు
ట్రాఫిక్‌తో ఇబ్బందులు

లక్సెట్టిపేట: పట్టణంలో వాహనదారులతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వందలాది వాహనాలతో ప్రజలతో రద్దీగా ఉండే రహదారిపై యువకులు విచ్చలవిడిగా బైక్‌లపై తిరుగుతూ ప్రజలను అవస్థలకు గురిచేస్తున్నారు. యువత నిబంధనలు పాటించకుండా లైసెన్సు లేకుండా బైక్‌లపై ముగ్గురు, నలుగురు తిరుగుతు అతివేగంగా వెళ్తున్నారు. బుల్లెట్ బైక్‌పై వెళ్తూ పెద్ద పెద్ద శబ్దాలను చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. రద్దీగా ఉండే ప్రదేశంలో బైక్‌లతో అతివేగంగా తిరుగుతూ ఇతరులకు ఇబ్బందులు కల్గిస్తున్నారు. ఇటీవల ఒక బైక్‌పై ముగ్గురు యువకులు అతివేగంగా వచ్చి బీట్‌బజార్‌లో ఆగి ఉన్న కారును ఢీకొనడంతో ఒకరు మృతిచెందారు. ఇలా తరచు పట్టణంలో రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నవి.

పట్టణంలో ప్రధాన రహదారి అంబేద్కర్ చౌక్ నుంచి బస్టాండు వరకు ఒకటే రోడ్డు ఉంటుంది. రోడ్డు ఇరుకుగా ఉండడతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. దుకాణాదారులకు వచ్చే సరుకులను తీసకువచ్చే భారీ లారీలు రోడ్లపై నిలుపుతూ అన్‌లోడ్ చేయడంతో ఇతర వాహనాలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ఆటోలు, బస్సులు, లారీలు బైక్‌లు, ఇతర వాహనాలతో నిత్యం పట్టణంలో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అంబేద్కర్ చౌక్, బీట్ బజార్, గాంధీ చౌక్ బస్టాండు ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య విపరీతంగా ఉంటుంది. ఆదివారం, గురువారం వారాల్లో రెండు రోజులు సంత ఉండడంతో విపరీతమైన రద్దీ ఉంటుంది. సంబంధిత అధికారులు పట్టించుకుని ట్రాఫిక్, బైక్ రైడింగ్ చేస్తున్న యువకులపై చర్యలు తీసుకొని ప్రజల ఇబ్బందులు తొలగించాలని పలువురు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



పట్టణంలో కొంచెం ట్రాఫిక్ సమస్య ఉంది. వాహనాలను అదుపు చేస్తున్నాం. కొన్ని ప్రదేశాల్లో ట్రాఫిక్ కానిస్టేబల్స్‌ను నియమించాం. యువత విచ్చల విడిగా వాహనాలను నడిపిన లైసెన్సులు లేకున్న, రాష్ డ్రైవింగ్ చేసిన కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

ఎస్సై లక్ష్మణ్, లక్సెట్టిపేట